క్లుప్తంగా

భూమి పూజ



మహదేవపూర్: మండల కేంద్రంలోని తస్నార్ కాలనీలో నూతన వర్క్ షెడ్ నిర్మాణ భూమి పూజను సర్పంచ్ శ్రీపతిబాపు ప్రారంభించారు. వర్క్‌షెడ్ మంజూరు పత్రాన్ని లబ్ధిదారుడికి అందించారు. అనంతరం వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి సహకరిస్తున్న సర్పంచ్ శ్రీపతిబాపును సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ వెన్నంపల్లి మహేష్, పంచాయతీ పారిశుద్ధ్య స్థాయి సంఘం కన్వీనర్ లింగాల రామయ్య, శ్రీ షిర్డీ సాయి బాబా దేవస్థాన చైర్మన్ మెరుగు లక్ష్మణ్, పురోహితులు కృష్ణమూర్తి, దేవాంగ కుల పెద్దలు కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ



కాటారం: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు సీఆర్పీఎఫ్ జవాన్ చిక్కుల పల్లి మనోహర్ తోడ్పాటును అందించారు. మండలంలోని దామెరకుంట ఎస్సీకాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మనోహర్, అతని మిత్రులతో కలిసి బుధవారం టై బెల్టులు పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు తమ వంతు సాకారం అందించి.. వారు ఉన్నత స్థానంలో నిలవడం కోసం కృషి చేస్తున్నట్లు మనోహర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బాసాని రవి, అల్లాడి రాజయ్య, పాఠశాల ఉపాధ్యాయులు సుష్మా, దేవేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లెప్రగతి పనుల పరిశీలన



మల్హర్: మండలంలోని మల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెప్రగతి పనులను డీఎల్‌పీఓ సుధీర్‌బాబు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలో, రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను పరిశీలించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని చెప్పారు. ప్రతి రోజు గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. పారిశుద్ధ్య పనులు, తాగు నీటి సరఫరాపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ రికార్డులను తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపిక



సతీష్‌కుమార్

ఎస్‌ఎస్‌తాడ్వాయి: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఎంప్లాయీస్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని కాటాపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రీరాముల సతీష్‌కుమార్ ఎంపికయ్యారు. మంగపేట మండలంలోని జెడ్పీఎస్‌ఎస్ పాఠశాలలో సతీష్‌కుమార్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి కబడ్డీ ఫైనల్ సెలక్షన్ పోటీల్లో ములుగు జిల్లా తరఫున పాల్గొని, అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ 2022–23 జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు సతీష్ కుమార్ తెలిపారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో ఈ నెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరిగే పోటీల్లో తెలంగాణ రాష్ట్ర సివిల్ ఎంప్లాయీస్ పురుషుల కబడ్డీ జట్టు తరఫున ఆడనున్నారు. పోటీలకు ఎంపికైన ఉపాధ్యాయుడు సతీష్‌కుమార్‌ను గ్రామస్తులు అభినందించారు.

కంకర కష్టాలు



కంకరతో నిండి ఉన్న రాఘవరెడ్డిపేట -కుందనపల్లి ప్రధాన రోడ్డు

- ప్రయాణికులకు తప్పని తిప్పలు
- మూడు నెలలుగా పత్తా లేని కాంట్రాక్టర్

టేకుమట్ల: మండలంలోని కుందనపల్లి– రాఘవరెడ్డిపేట మధ్య పది సంవత్సరాల క్రితం బీటీ రోడ్డు ధ్వంసం కావడంతో ప్రజలు పలుమార్లు బాగుచేయాలని ప్రజాప్రతినిధులు, అధికారుల ఎదుట మొరపెట్టుకున్నారు. దీంతో ఇటీవల రూ.3కోట్ల నిధులను కేటాయించి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. దీంతో గత డిసెంబర్‌లో రోడ్డు కాంట్రాక్టర్ పాత బీటీ రోడ్డును పూర్తిగా తొలగించి, నూతనంగా కంకర పోసి పనులు ప్రారంభించారు. ఇక నూతన రోడ్డుతో రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని భావించగా.. నేటికీ రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడంలేదు. రాఘవరెడ్డిపేట, ఆరెపల్లి, కుందనపల్లి, బండపల్లి, వెన్నంపల్లి గ్రామాల రైతుల వ్యవసాయ భూములు ఎక్కువగా రాఘవరెడ్డిపేట–కుందనపల్లి ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉండడంతో నిత్యం రైతులు ఎడ్లబండ్లతో, కాలినడకన వ్యవసాయ పొలాలకు వెళ్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎడ్లు కంకరపై రోజు వెళ్లడంతో కాడెడ్ల కాళ్లకు కంకర రాళ్లు గుచ్చుకుంటూ అనారోగ్య పాలౌతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఆరెపల్లి, వెల్లంపల్లి, గుమ్మడవెల్లి, బండపల్లి, కుందనపల్లి, ఎంపేడు గ్రామాల ప్రజలు నిత్యం మండల కేంద్రానికి అధికార కార్యాలయాలకు, వ్యక్తిగత అవసరాల కోసం వస్తూ వెళ్తుంటారు. సుమారు 3కిలో మీటర్ల మేర కంకర పోసి వదిలేయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడి, ఆస్పత్రుల పాలవుతున్నారు.



పత్తిపంటపై పడిన దుమ్ము

పత్తా లేని కాంట్రాక్టర్..

రోడ్డు కాంట్రాక్టర్ గత డిసెంబర్‌లో మూడు కిలో మీటర్ల మేర బీటీ తీసి నూతనంగా రోడ్డు నిర్మించేందుకు కంకర పోసి వదిలేసి పత్తా లేకుండా పోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని పలువురు గ్రామస్తులు ప్రజాప్రతినిధులకు మొర పెట్టుకున్నా పట్టించుకునేవారే కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పంటలన్నీ దుమ్ముతో నిండుతున్నాయి

ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులకు కాంట్రాక్టర్ శాపంగా మారి రోడ్డుపై కంకర పోసి వదిలేయడంతో పంటలపై పూర్తిగా దుమ్మూ, దూళి పేరుకుపోవడంతో పంటలన్నీ పూర్తిగా పాడైపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పత్తి, మిరప, వరి పంటలపై గత మూడు నెలలుగా దుమ్మూ, దూళి చేరడంతో రైతులు నష్టాలను చవి చూస్తున్నారు. పత్తి పంటపై పేరుకుపోయిన దుమ్ముతో కనీస మద్దతు ధర సైతం రావడం లేదని వాపోతున్నారు.

ప్రయాణం ఇబ్బందిగా ఉంది



బండపల్లి నుంచి రామకిష్టాపూర్(వి) పాఠశాలకు బైక్‌పై పాఠశాలకు వెళ్తున్నాను. నూతన రోడ్డు కోసం బీటీని తీసి కంకర పోసి మూడు నెలలు అయింది. రోజూ కంకరపై ప్రయాణం భయంగా ఉంది. విధులకు వెళ్లేందుకు మరో మార్గం లేకపోవడంతో తప్పనిసరి ఇదే రోడ్డుపై వెళ్తున్న. పనులు త్వరగా పూర్తి చేసేలా కృషి చేయాలి.

– కుడికాల శ్రీనివాస్, ఉపాధ్యాయుడు బండపల్లి

దుమ్ముతో ఇబ్బంది పడుతున్నాం



నూతన బీటీ రోడ్డు కోసం బీటీని తొలగించి కంకర పోసి వదిలేయడంతో నిత్యం ప్రయాణించే వాహనాల రాకపోకలతో ఇళ్లలోకి వచ్చే దుమ్ముతో తీవ్ర ఇబ్బంది తప్పడంలేదు. రోడ్డు పక్కన్నే ఇళ్లు ఉండడంతో నిత్యం దుమ్మునే పీల్చుకుంటున్నాం. ఇలాంటి వాతావరణంలో పిల్లల ఆరోగ్యం క్షీణించే అవకాశం ఉంది.

– కోరె చందు, ఆరెపల్లి

బ్యాంక్ బీమా కుటుంబానికి భరోసా



చెక్కు అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

టేకుమట్ల: బ్యాంక్ బీమా కుటుంబానికి భరోసాను కల్పిస్తుందని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ జిల్లా రిజినల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని రామకిష్టాపూర్(టీ) గ్రామానికి చెందిన లింగంపల్లి రాములు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందగా బ్యాంక్ ఇన్సూరెన్స్ ద్వారా వచ్చిన రూ.20లక్షల బీమా చెక్కును మృతుడి భార్య లింగంపల్లి జమునకు టేకుమట్ల బ్యాంక్ మేనేజర్ మంగేష్ ఆధ్వర్యంలో బుధవారం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యాంక్‌బీమాను ప్రతి ఒక్కరూ చేసుకోవాలని, తక్కువ ప్రీమియంతో ఇన్సూరెన్స్ సౌకర్యం ఉందని తెలిపారు. సంవత్సరానికి రూ.20తో ప్రమాద బీమా రూ.2లక్షలు, సంవత్సరానికి రూ.432తో సాధారణ మరణం రూ.2లక్షల బీమా, సంవత్సరానికి రూ.1,000లతో ప్రమాద బీమా రూ.20లక్షలు వర్తిస్తుందని తెలిపారు. కావున బ్యాంక్ బీమాలు కుటుంబానికి ఎంతో భరోసాను కల్పిస్తాయని, కావున ప్రతీ ఒక్కరు బ్యాంక్ బీమాలను కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఐసీ నోడల్ అధికారి శ్రీనివాస్, ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ మేనేజర్ మహేంద్ర, బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్లు రవినాయక్, ప్రశాంత్, క్యాషియర్ నవీన్, బ్యాంక్ మిత్ర బొజ్జపెల్లి రాజేందర్, గ్రామ దీపిక భూపెల్లి విజయ, సీఏ అశోక్, ఎల్లంకి సుమతి, సిబ్బంది రాజు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న నారాయణరెడ్డి

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన బానాల రమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా, వారి కుటుంబాన్ని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, కాటారం పీఏసీఎస్ చైర్మన్ చల్లా నారాయణరెడ్డి బుధవారం పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాన్నికి ఆర్థికసాయం అందజేశారు.

జీవాల ఆరోగ్యంపై దృష్టిసారించాలి

- నట్టల నివారణ మందులు వేయించాలి
- జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి రంగారావు

భూపాలపల్లి రూరల్/కాటారం: పశువుల యజమానులు తమ జీవాలకు నట్టల నివారణ మందులు వేయించాలని జిల్లా పశు, సంవర్ధకశాఖ అధికారి రంగారావు అన్నారు. బుధవారం భూపాలపల్లి మండలంలోని నేరేడుపల్లి, కాటారం గ్రామ పంచాయతీ పరిధిలో మండల పశు వైద్యాధికారులు తిరుపతి, రాకేశ్‌శర్మ ఆధ్వర్యంలో జీవాలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పశు, సంవర్ధక శాఖ అధికారి రంగారావు ప్రారంభించి, మాట్లాడారు. జీవాలకు నట్టల నివారణ మందులు వేయించడం వలన కలిగే ఉపయోగాలను వివరించారు. పశుసంపదను పెంపొందించుకుని ఆదాయం పెంచుకోవాలని రైతులకు సూచించారు. జీవాల ఎరువును పంట పొలాల్లో వేసుకోవడం ద్వారా దిగుబడి వస్తుందన్నారు. జీవాల ఆరోగ్యంపై యజమానులు దృష్టిసారించాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ మండల లావణ్య, సర్పంచ్ దానవేని రమాదేవి, ఎంపీటీసీ అప్పం రజిత, బీఆర్‌ఎస్ నాయకులు సాగర్‌రెడ్డి, కుమార్, గడ్డం చంద్రయ్య, సిబ్బంది రాజశేఖర్, గోపాల మిత్ర శ్రీనివాస్, మేకల, గొర్రెల పెంపకదారులు పాల్గొన్నారు.



భూపాలపల్లి రూరల్: జీవాలకు మందు వేస్తున్న రంగారావు

ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి రూరల్: విద్యుత్‌శాఖలో పని చేస్తున్న ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఎంప్లాయీస్ యూనియన్ హెచ్–82 కార్యనిర్వాహక అధ్యక్షుడు నాగుల తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు. డిమాండ్స్‌ను వెంటనే పరిష్కరించాలని కోరుతూ.. బుధవారం భోజన విరామ సమయంలో విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం ఎదుట ఉద్యోగులతో ధర్నా నిర్వహించారు. అనంతరం టెక్నికల్ డీఈ విజయరాజుకు డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించని పక్షంలో దశల వారీగా ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విద్యాసాగర్, అంజయ్య, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరిగితేనే స్పందిస్తారా

మహాముత్తారం: గత మూడు నెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు మండలంలోని ప్రధాన రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. యత్నారం నుంచి సింగంపల్లి, మీనాజీపేట, నర్సింగాపూర్, బోర్లగూడెం, నిమ్మగూడెం తదితర గ్రామాల్లోని ప్రధాన రహదారులు భారీగా కోతకు గురయ్యాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కాటారం నుంచి మేడారం వెళ్లే ప్రధాన రహదారి డొబ్బలపాడ్ వద్ద భారీగా కోతకు గురైంది. ప్రధాన రహదారి కావడంతో రోజు వందల సంఖ్యలో ఈ రహదారి నుంచి వాహనాల రాకపోకలు ఉంటాయి. పూర్తిగా ధ్వంసం అయినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టి ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



భారీగా కోతకు గురైన మీనాజీపేట ప్రధాన రహదారి

నిధులు కేటాయించాలి

ములుగు రూరల్: ములుగు జిల్లా బండారుపల్లి శివారులో అంబేడ్కర్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, మాదిగ దండోరా జాతీయ నాయకుడు చుంచు రవి, నెమలి నర్సయ్య కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ క్రిష్ణా ఆదిత్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అంబేడ్కర్ భవనం కోసం ప్రభుత్వం స్థలం కేటాయించిందని రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమించేందుకు చూస్తున్నారని తెలిపారు. స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించి భూ అక్రమణను కట్టడి చేయాలని కోరారు. ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ 15 రోజుల్లో భవన నిర్మాణ నిధులకు అనుమతులు ఇప్పిస్తానని హామి ఇచ్చారు. కార్యక్రమంలో మారాతి రవిందర్, నద్దునూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ సభను విజయవంతం చేయాలి

టేకుమట్ల: నేడు(గురువారం) జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న మంత్రి కేటీఆర్ సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గండ్ర జ్యోతి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివచ్చి కేటీఆర్‌కు ఘన స్వాగతం పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ పోతనవేని ఐలయ్య, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్, వివిధ గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు నల్లబెల్లి రవీందర్, అడగాని రామారావు, మహిపాల్‌రెడ్డి, సంగి రవి, బిక్కినేని సంపత్‌రావు, గందం సారయ్య, పెరుమాండ్ల మొగిళి, నేరేళ్ల శ్రీనివాస్, చింతలపెల్లి స్వామిరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గండ్ర జ్యోతి

విజయవంతం చేయాలి

చిట్యాల: మంత్రి కేటీఆర్ నేడు భూపాలపల్లి జిల్లాకు వస్తున్న సందర్భంగా నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, టీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న అన్ని మండలాల కోఆప్షన్ సభ్యులు గ్రామాల వారీగా ఉన్న మైనారిటీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని మండల కో ఆప్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ రాజ్ మహమ్మద్ ఒక ప్రకటనలో కోరారు.

ఘనంగా వరల్డ్ థింకింగ్ డే



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జీఎం శ్రీనివాసరావు

భూపాలపల్లి అర్బన్: స్కౌట్ పితామహుడు రాబర్ట్ బెడెస్ పౌల్ జన్మదిన సందర్భంగా భారత్ స్కౌట్ అండ్ గైడ్స్, సింగరేణి డిస్ట్రిక్ట్ భూపాలపల్లి ఏరియా ఆధ్వర్యంలో వరల్డ్ థింకింగ్ డే కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏరియాలోని సుభాష్‌కాలనీ స్కౌట్స్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు హాజరై స్కౌట్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. స్కౌట్ అండ్ గైడ్స్ సేవే పరమార్థంగా రూపొందిన వ్యవస్థ బ్రిటన్‌లో ప్రారంభమై ప్రపంచంలోని అన్ని దేశాల్లో కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. కరువు కాటకాలు, వరదల సమయంలో బాధిత కుటుంబాలకు ఈ సంస్థ అందించే సేవలు గొప్పవన్నారు. అనంతరం ఇటీవల శిక్షణ పొందిన సభ్యులకు సర్టిఫికెట్స్ అందించి వారిని అభినందించారు. కార్యక్రమంలో ఏరియా అధికార ప్రతినిధి తుకారాం, సీనియర్ పీఓ శ్యాంప్రసాద్, స్కౌట్ సభ్యులు రాజమౌళి, పవన్ పాల్గొన్నారు.

సమస్యలపై మంత్రికి విన్నవించాలి

భూపాలపల్లి రూరల్: ఉపాధిహామీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే విధంగా రాష్ట్ర మంత్రి కేటీఆర్‌కు విన్నవించాలని కోరుతూ.. ఉపాధి హామీ ఉద్యోగులజాక్ కమిటీ చైర్మన్ జమీర్‌పాషా ఆధ్వర్యంలో ఉద్యోగులు బుధవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జమీర్‌పాషా మాట్లాడారు. గ్రామీణాభివృద్ధి శాఖలో పని చేస్తున్న సెర్ప్ సిబ్బందికి పే స్కేల్ అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించందన్నారు. కానీ, అదే శాఖలో గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఉపాధి ఉద్యోగులకు పే స్కేల్ ప్రకటించలేదన్నారు. మంత్రిని కలిసే అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న సంఘం బాధ్యులు

ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉపాధి హామీ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మోరె కుమారస్వామి, నాయకులు విఠల్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న కీర్తిరెడ్డి

మొగుళ్లపల్లి: అక్రమ అరెస్టులు సరికావని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు చెవ్వ శేషగిరి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో చందుపట్ల కీర్తిరెడ్డి, చదువు రాంచంద్రారెడ్డి పాల్గొని, మాట్లాడారు. విద్యార్థుల సమస్యలపై నిత్యం పోరాడే ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ మెంబర్, జయశంకర్ జిల్లా ఏబీవీపీ కన్వీనర్, వేల్పుల రాజ్ కుమార్‌ను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. 48 గంటలు గడుస్తున్న రాజ్‌కుమార్‌ను ఎక్కడ ఉంచారో సమాచారం ఇవ్వని పరిస్థితి దాపురిస్తుందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజల్లో తిరిగే పరిస్థితి లేదని అభిప్రాపడ్డారు. ప్రశ్నించే గొంతులను అరెస్ట్ చేసి కేటీఆర్ సభను జరుపుకునేందుకు సిద్ధమయ్యారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ సభను అడ్డుకుంటామని చెప్పారు. భూపాలపల్లి నియోజకవర్గ కన్వీనర్ మోరె రవీందర్ రెడ్డి, బుర్ర వెంకటేష్ గౌడ్, బండారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీతోనే పారదర్శక పాలన



పాదయాత్రలో పాల్గొన్న చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, తదితరులు

- 24న బండి సంజయ్ రాక

కాటారం: అవినీతి రహిత, పారదర్శక పాలన బీజేపీతోనే సాధ్యమని మంథని ప్రజలు తమకు ఒక్కసారి అవకాశం ఇచ్చి చూడాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. మంథని గోస బీజేపీ భరోసా పేరిట చంద్రుపట్ల సునీల్‌రెడ్డి చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర కాటారం, ఆదివారంపేట, గుమ్మాళ్లపల్లి, ఒడిపిలవంచ, వీరాపూర్ గ్రామాల్లో బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా సునీల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని ఆరోపించారు. ఈ ప్రాంత ప్రజల ఓట్లతో పదవులు అనుభవిస్తున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు ప్రజల సమస్యలను పరిష్కరించడంలో మాత్రం శ్రద్ధ చూపడం లేదన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్ వెంకటస్వామి ఈ నెల 24న కాటారం మండల కేంద్రానికి రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చంద్రుపట్ల రాంరెడ్డి, యాత్ర ప్రముఖ్ వెన్నంపల్లి పాపయ్య, అనిల్‌రెడ్డి, బండం వసంతరెడ్డి, మల్కమోహన్‌రావు, బొమ్మన భాస్కర్‌రెడ్డి, దుర్గం తిరుపతి, ఉడుముల విజయారెడ్డి, పూసాల రాజేంద్రప్రసాద్, సంపత్, శ్రీధర్, దోమల సమ్మయ్య, పాగె రంజిత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో.. కార్యకర్తల్లో జోష్

హాథ్ సే హాథ్ పేరుతో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్న యాత్ర బుధవారం జిల్లాలో కొనసాగింది. ఈక్రమంలో రేవంత్ తనదైన ప్రసంగం.. అధికార, ఇతర పార్టీల నేతలపై మాట్లాడిన తీరుతో జిల్లాలోని కాంగ్రెస్ కార్యకర్తల్లో జోష్ పెరిగింది.





